క్లుప్తంగా

నిషేధిత గుట్కాలు విక్రయిస్తే చర్యలు



తనిఖీలు చేస్తున్న సీఐ నాగార్జునరెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలో నిషేధిత గుట్కాలు విక్రయిస్తే చర్యలు తప్పవని రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల పరిసరాల్లో ఉన్న దుకాణాలను శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. అనంతరం కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తడి-పొడి చెత్తను వేరుగా సేకరించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజలు చెత్తను బయట పడేయకుండా అవగాహన కల్పించి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. ఆమె శుక్రవారం నెలవాయి గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తులు, పారిశుద్ధ్య కార్మికులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను, గ్రామంలోని విధులను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం మునెయ్య, ఏపీవో దేవరి పాల్గొన్నారు.

వీటిపై ఎందుకు నిర్లక్ష్యం?



బస్టాండ్ వద్ద ఖాళీగా ఉన్న రూములు

రేణిగుంట: పట్టణంలోని బస్టాండ్ వద్ద గత ప్రభుత్వంలో స్థానికులు పంచాయతీ నుంచి స్థలాన్ని లీజుకు తీసుకొని 7 రూములు నిర్మించుకొని వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బస్టాండులో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న ఆ రూములను తొలగించాల,ని చెప్పి ఖాళీ చేయించారు. ఏడాది గడిచినా ఇంతవరకు రూములను తొలగించలేదు. ఈ సంవత్సరం పాటు ఎవరికైనా బాడుగకు ఇచ్చి ఉంటే కనీసం పంచాయతీకి ఆదాయమైనా వచ్చేది. కానీ బతికే వాళ్లను బతకనీయకుండా, పంచాయతీకి ఆదాయం లేకుండా చేయడంపై స్థానికుల నుంచి విమర్శలు ఎదురవుతున్నాయి.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు అందజేస్తున్న యుగంధర్ రెడ్డి

వరదయ్యపాళెం: మండలంలోని వెంగారెడ్డికండ్రిగ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్థానిక హెచ్ఎం ఆనంద్ ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశారు. వారు మాట్లాడుతూ దాతల చేయూతను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ రెడ్డి, నరసరాజు, రమేష్ రెడ్డి, నందనం శంకర్ పాల్గొన్నారు.

ఆడికృత్తిక పోస్టర్ల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఈ నెల 20న ఆడికృత్తిక ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శుక్రవారం విశేష పూజలు నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 19న భరణి, 20న ఆడికృత్తిక, 21న తెప్పోత్సవం, 22న కల్యాణోత్సవం జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, హరిబాబుయాదవ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఊంజల్ సేవ

నారాయణవనం: పద్మావతీ అమ్మవారికి శుక్రవారం సాయంత్రం ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. సాయంత్రం అమ్మవారిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. తదుపరి ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు.

కదలని మురుగు



చెన్నవారిపాళెంలో నిల్వ ఉన్న మురుగునీరు

వరదయ్యపాళెం: మండలంలోని కాంబాకం పంచాయతీ చెన్నవారిపాళెం గ్రామంలో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. రోడ్డు పక్కనే మురుగు నీరు నిలుస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పల్లె పండుగ కింద చెన్నవారిపాళెంలో సిమెంటు రోడ్డును నిర్మించారు. దానికి ఇరువైపులా మట్టి తోలకుండా అలాగే వదిలేశారు. దీంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్డుకు ఇరువైపులా నిలుస్తోంది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మురుగు నీటిలో దోమలు వృద్ధి చెంది రాత్రిళ్లు కంటి మీద కునుకు లేకుండా వుందని స్థానికులు వాపోతున్నారు. తరచూ జ్వరాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతోనే తిప్పలు పడాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నాగలాపురం: మండలంలోని సుబ్బనాయుడు కండ్రిగ, బీరకుప్పం సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏడీ రమేష్‌చంద్ర, ఏఈ పృథ్వీ తెలిపారు. సుబ్బనాయుడు కండ్రిగ, బీరకుప్పం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

రేణిగుంట: రేసబ్ డివిజన్ పరిధిలోని శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ రమేష్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తూకివాకం, కరకంబాడి, గురవరాజుపల్లి, ఎల్లమండ్యం, గాజులమండ్యం, కురకాలువ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వినియోగదారులందరూ విద్యుత్ అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

శ్రీకాళహస్తి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తిరుపతి రూరల్ ఈఈ చిన్నరెడ్డెప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడు కండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

నాగలాపురం: సత్యవేడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదేశించారు. ఆయన శుక్రవారం సాయంత్రం పిచ్చాటూరు ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎంపీడీవోలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీటి సమస్య, శ్మశానాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ కింద పండ్ల తోటల పెంపకం, కాలువలు, చెరువులు, పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రభుత్వం మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అర్హులైన వారిని గుర్తించి పింఛన్లు, ఇళ్లు మంజూరు చేయాలన్నారు.

సర్వేతో పేద కుటుంబాల గుర్తింపు



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: పీ4 సర్వే ద్వారా అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి, వారి ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తామని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. ఆమె శుక్రవారం గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పీ4 సర్వేపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ పేదరికం నిర్మూలన కోసం ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన కార్యక్రమం పీ4 సర్వే అని తెలిపారు. ఇందులో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక సహాయం, సామాజిక సేవలపై దృష్టి పెట్టడం ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. మండలంలో పీ4 సర్వే కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మునిసుబ్రమణ్యం, ఏవో షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌కు నిరసన సెగ



శంకర్‌రెడ్డిని అడ్డుకుని నిరసన తెలుపుతున్న గురుకులకండ్రిగ గ్రామస్తులు, విద్యార్థులు

కేవీబీపురం: మండల పర్యటనకు వచ్చిన టీడీపీ నియోజకవర్గ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ శంకర్ రెడ్డికి ప్రజల నుంచి నిరసన సెగ తగిలింది. ఆయన శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా అంజూరు, అంజూరుపాళెం బయలుదేరారు. మార్గమధ్యంలో గురుకులకండ్రిగ గ్రామస్తులు, విద్యార్థులు ఆయనను అడ్డుకున్నారు. కారు ముందుకు పోకుండా నిరసన తెలిపారు. గురుకులకండ్రిగ పాఠశాల విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఆయన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆయన కారు ముందుకు కదిలింది.

పేద విద్యార్థులకు నగదు బహుమతి



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న మన్నెం శివయ్య శెట్టి

సత్యవేడు: పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన దేవాంగ కులస్తుల పిల్లలకు నగదు బహుమతులు అందజేస్తున్నట్టు దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. స్థానిక వైదేహీ కల్యాణ మండపంలో శుక్రవారం దేవాంగ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నెం శివయ్యశెట్టి తన భార్య హేమావతి జ్ఞాపకార్థం పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు జీ.లోహిత్, కే.పోషికకు రూ.5 వేల చొప్పున బహుమతి అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు పాండురంగయ్య, ప్రధాన కార్యదర్శి వై.మురళీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ మన్నెం గణపతి, కోశాధికారి పి.రవిబాబు, సంయుక్త కార్యదర్శి ఎం.చెంచులయ్య, సభ్యులు మధుబాబు, ఎం.గిరికుమార్, ఎం.దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పగలు వెలుగులు-రాత్రి చీకటి



తుంబూరులో కనెక్షన్ లేని వీధిదీపాలు



చిత్తూరుకండ్రిగ ఏపడబ్ల్యూలో విరామం లేకుండా వెలుగుతున్న వీధి దీపాలు

నారాయణవనం: మండలంలోని పలు గ్రామాల్లో వీధి దీపాలు పగలు వెలుగుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో చీకటి అలుముకుంది. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ లోవోల్టేజీ సమస్యను అధిగమించడానికి, సూర్యఘర్ యోజన పథకంలో హెచ్‌టీ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా తుంబూరు పంచాయతీలో సింగిల్ ఫేజ్ లైన్లను తొలగించి, కొత్తగా విద్యుత్ స్తంభాలు నాటి త్రీ ఫేజ్ లైన్లు లాగారు. వాటికి వీధి దీపాలను అమర్చడం మరిచారు. దీంతో వారం రోజులుగా గ్రామంలో అంధకారం నెలకొంది. అదేవిధంగా అరణ్యకండ్రిగ పంచాయతీ చిత్తూరుకండ్రిగ ఏపడబ్ల్యూలో కొత్త లైన్లు లాగి వీధి దీపాలు అమర్చారు. వాటి నియంత్రణకు స్విచ్‌లు ఏర్పాటుచేయకపోవడంతో పగలూ, రాత్రి వెలుగుతూనే ఉన్నాయి. పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కన్యాకుమారి రైల్లో తనిఖీలు



రేణిగుంట: అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషన్ ఆర్.పి.ఎఫ్ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈగల్ టీం, పోలీసు సిబ్బంది సంయుక్తంగా శుక్రవారం కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ లో రేణిగుంట నుంచి పాకాల వరకు తనిఖీలు చేశారు. రైలులో గంజాయి ఇతర మాదకద్రవ్యాలు అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు చేశారు.

జనాభా పెరుగుదలతోనే పేదరికం



బుచ్చినాయుడుకండ్రిగ: పుత్తేరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: జనాభా పెరుగుదలతోనే దేశంలో పేదరికం పెరుగుతుందని వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పుత్తేరి గ్రామంలో జనాభా పెరుగుదల, నియంత్రణపై అవగాహన కల్పించి, గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని జనాభా 143 కోట్లకు చేరిందన్నారు. జనాభా పెరుగుదల వలన తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలన్నారు. జనాభా పెరుగుదలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

చిన్న కుటుంబం.. చింత లేని కుటుంబం

సత్యవేడు: చిన్న కుటుంబం.. చింతలేని కుటుంబమని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.క్రిష్టల్ దాస్ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సత్యవేడులోని బాలుర గురుకుల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, అధిక జనాభా వల్ల అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ యుక్త వయస్సు వచ్చిన తర్వాతే పెళ్లి చేసుకోవాలన్నారు. బాలికలు చదువుకుంటే కుటుంబాలతోపాటు సమాజం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హర్షవర్ధన్, ప్రిన్సిపాల్ సత్యనారాయణరాజు, ఎంపీహెచ్ఈవో ఎస్.సుబ్రమణ్యం, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, స్టాఫ్ నర్సు భువనేశ్వరి, ఏఎన్ఎం టి.రేణుక పాల్గొన్నారు.

జనాభా నియంత్రణతోనే దేశాభివృద్ధి

వరదయ్యపాళెం: జనాభా నియంత్రణతో దేశాభివృద్ధి సాధ్యమని వరదయ్యపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి ద్వైత తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించి ఒక్కరూ లేదా ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకోవాలని సూచించారు. అనంతరం జనాభా నియంత్రణలో భాగస్వాములు అవుదామని వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.



సత్యవేడులో ర్యాలీ చేస్తున్న వైద్యులు, విద్యార్థులు



వరదయ్యపాళెంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం



మద్యం బాటిళ్లతో పట్టుబడిన వ్యక్తి

శ్రీకాళహస్తి: అక్రమంగా విక్రయిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, విక్రేతను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ గోపి కథనం మేరకు పాతసాయిరాం వీధిలోని ఓ కూల్ డ్రింక్ దుకాణం నడుపుకుంటున్న రాంబాబు అక్రమంగా మద్యం అమ్ముతున్నాడు. పోలీసులు గుర్తించి దాడి చేసి రాంబాబును అదుపులోకి తీసుకుని 26 మద్యం సీసాలను సీజ్‌చేశారు.

హద్దుమీరితే చర్యలు తప్పవు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగార్జునరెడ్డి

శ్రీకాళహస్తి: క్షణికావేశం వద్దని హద్దుమీరితే చర్యలు తప్పవని రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. ధర్మరాజుల తిరునాళ్లలో తలెత్తిన వివాదంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో జరిగిన గొడవకు సంబంధించి కేసులు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. వీఎంపల్లి, ఎంఎంవాడ, మంచినీళ్ల గుంట ప్రాంతాలకు చెందిన పలువురు రౌడీషీటర్లకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ క్షణికావేశాలతో వివాదాలకు పాల్పడవద్దని చెప్పారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, ప్రవర్తనను మార్చుకోవాలని సూచించారు. అంతకు ముందు వీఎంపల్లి ప్రాంతంలో గురువారం రాత్రి డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఎంఎంవాడ, మంచినీళ్ల గుంట ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేశారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి అవగాహన కల్పించారు.

గుత్తివారి పల్లెలో రోడ్డు ఆక్రమణను తొలగించాలి



ఆక్రమించుకున్న రోడ్డులో ముళ్ల కంపలు వేసిన గ్రామస్తులు

రేణిగుంట: మండలంలోని గుత్తివారిపల్లెలో రోడ్డు ఆక్రమణను తొలగించి రాకపోకలు సాగించేలా అధికారుల చర్యలు తీసుకోవాలని స్థానిక దళితులు శుక్రవారం నిరసన చేపట్టారు. గ్రామంలో రోడ్డుకు అడ్డంగా నిర్మించుకున్న నిర్మాణాలను తొలగించి తమకు దారి కల్పించాలని కోరారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధ్యాయుల వేతనాల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి వెంకటేష్ కోరారు. వారు శుక్రవారం ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యంకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఎస్ఆర్‌ల నమోదు పూర్తి చేయాలని, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండల కేంద్రంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో యువశ్రీమురళి, లక్ష్మయ్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోండి





బీసీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న డీపీవో సుశీలాదేవి, సత్యవేడు: సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో

సత్యవేడు/నాగలాపురం: అందుబాటులో వున్న వనరులను సద్వినియోగం చేసుకుని పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవాలని డీపీవో సుశీలాదేవి ఆదేశించారు. ఆమె శుక్రవారం సత్యవేడు, నాగలాపురం మండలాల్లో పర్యటించారు. నాగలాపురంలోని బజారు వీధి, బీసీ కాలనీల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెత్త సేకరణ, మురుగు కాలువల శుభ్రతపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సత్యవేడు, నాగలాపురం ఎంపీడీవో కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఆస్తి పన్నులను సక్రమంగా వసూలు చేయాలని సూచించారు. ప్రతి రోజూ పారిశుద్ధ్య పనులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల వివరాలను ఐవీఆర్ఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. పారిశుద్ధ్యంలో సత్యవేడు మండలం వెనుకబడి ఉందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో గ్రీన్ అంబాసిడర్ల వేతనాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తాగునీటి వసతి, పారిశుద్ధ్యం, వీధి లైట్లు తదితరాలకు కూడా వినియోగించుకోవాలని సూచించారు. చెత్త సేకరణ రిక్షాలకు మరమ్మతులు చేయించుకుని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. 15 రోజులకొకసారి తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త వేయరాదని నోటీసు బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. అదే పనిగా చెత్త వేస్తున్న వారికి జరిమానా విధించాలని సూచించారు. మండలాల్లో అధిక సంఖ్యలో స్వర్ణ పంచాయతీలు ఎంపికయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాగలాపురంలో సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీడీవో బాలాజీనాయక్, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, జూనియర్ అసిస్టెంట్ కలన్, సత్యవేడులో ఎంపీడీవో పి.త్రివిక్రమరావు, సెక్రటరీలు మునిరవికుమార్, హరీష్, శైలేంద్ర, జ్ఞానప్రకాష్, కుముద, సరిత, మణికంఠ, రజనీకాంత్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.